# మాతృప్రేమ

"సంఘానికీ,—
వాత్సల్యానికీ
నడుమ నలిగిపోయింది
ఆ మాతృహృదయం—"

రచయిత:

## ప్రేమికుడు

'ఆ తేలిపోతున్న బరువైన కళ్ళల్లో మూర్తి ప్రతిబింబిస్తే ఆమె ఆత్మకు ఎంత శాంతి!'

సముద్రుని గంభీర స్వరాలతో శ్రుతి కలిపి 'రాజు' గుండెలో ప్రతిధ్వనిస్తూ, ప్రబోధిస్తున్నై శ్యామల పలుకులు.

తొందర తొందరగ ఇంటికొచ్చి,—

'శ్యామ్! ఈరాత్రే!'నువ్వూను...!

'నేనొస్తే ఆమె ఆత్మ ఏడుస్తుంది, రాజూ!'

* * *

రాజు శుద్ధ శ్రోత్రియుడే;—

కాని, వాతావరణం,ఉన్నతవిద్యా, —ఆచారవ్యవహారాలలో మార్పుల్ని తెచ్చాయి.

అక్క అలివేణీ, తల్లి మంగళం తప్ప అడిగేవారెవ్వరూ లేరు.

* * *

శ్యామల సౌహృదయి,స్వార్థత్యాగిని. జాతిహీనరైన సుగుణమణి.

కడుపుకోసానికని 'కులం' మార్చుకున్నాడు తాత.

తండ్రి పెద్ద ఆఫీస్‌లో ఉద్యోగి.

* * *

రాజూ, శ్యామలా కాలవాహినిలో కలుసుకున్నారు.

పరిచయం ప్రేమగ పరిణమించింది.

గాఢంగా పెనవైచుకుంది.

* * *

ముసుగుల మూలాన మంగళం చెవులలో పడింది.

సనాతన స్త్రీ—కలత చెందింది.

'తన తనయుడేనా!'అని ఆక్రోశించింది.

సంఘానికీ,—వాత్సల్యానికీ నడుమ నలిగిపోయింది ఆ మాతృహృదయం!

మంచంపట్టింది ఆ ముదుసలి.

* * *

'వచ్చేవా నా కన్న తండ్రీ!'

త్రుళ్ళిపడి లేచింది అలివేణి.

'అమ్మా!'

'రాజూ!'

'వైరిచ్చాను అన్నయ్యకి!'

ఆ కొసా ఈ కొసా గుడ్డిగ వెలుగుతున్నై రెండు లాంతర్లు.

అటూ ఇటూ పచారు చేస్తున్నాడు గొణుక్కుంటూ,— ఎఱ్ఱటి దీపాన్ని పట్టుకున్న పోర్టర్.

చీకటి చలిలో తనదుస్థితికి చింతిస్తున్నాడేమో!

* * *

పాములాగ బుసకొడ్తూ, ఆయాసంతో ఆగింది ప్యాసింజర్.

రెండుమూర్తులు బండీలోంచిదిగాయి.

చీకట్లని చీలుస్తూ చినుకులు.

ఆ చీకటి చినుకులలో,—ఆ చిన్న స్టేషన్లో బళ్ళెక్కడ!

* * *

రాళ్ళమీంచీ — నీళ్ళల్లోంచీ — నాస్తూ...జార్తూ...ఒళ్ళు తెలియకుండా —కళ్ళూ, కాళ్ళూ నొప్పులు పోయేట్టు పరుగులు తీశారు!

* * *

'అమ్మా!'

తొందరతో తలుపుతీసింది అలివేణి.

పొంగి పొర్లింది అణగివున్న దుఃఖం ఆమెలో!

'రా...జూ!' చినుకలని చీలుస్తూ ఓ భగ్నస్వరం!

ఆవేదనతో ఆనందాశ్రువులను రాల్చింది శ్యామల.

'అయ్యో!' విలపించాడు రాజు.

* * *

'అయ్యో' అని ప్రతిధ్వనించింది ప్రకృతి మాత,—చలి చినుకులలో కాగిపోతున్న శ్యామలను చూసి!

ఆకాశాన ఆశాజ్యోతి ఆడుకుంటోంది పాడ్తూ!